క్లుప్తంగా

ఘనంగా పెద్దమ్మ తల్లి జాతర

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని రాజాపురం గ్రామంలో కొలువుదీరిన పెద్దమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మ వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేశారు. అనంతరం ఆలయంలో అమ్మ వారి కల్యాణాన్ని అత్యంత వైభవంగా జరిపించారు. భక్తులకు అన్నప్రసాదాలను అందజేశారు. జాతర సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అన్ని ఏర్పాట్లు చేశారు.

మావూళ్లమ్మ అలంకరణలో అమ్మవారు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయంలో జాతర ఉత్సవాల సందర్భంగా ఆదివారం అమ్మవారు శ్రీ మావూళ్లమ్మ అలంకరణలో దర్శనం ఇచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించారు. అలాగే అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. జాతర ఉత్సవాలు రెండోవ రోజుకు చేరగా, సాయంత్రం సమయంలో ఆలయ వద్ద హరిచంద్ర నాటకాన్ని ప్రదర్శించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరాగా ఆలయం వద్ద సందడి నెలకొంది.

క్రీడాకారులకు సన్మానం

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని సిటీస్టైల్ జిమ్ చెందిన క్రీడాకారులు బంగారు పతకాలు సాధించిన సందర్భంగా క్రీడాకారులను కోచ్ జీవీ రామిరెడ్డి ఆదివారం ఘనంగా సన్మానించారు. ఈ నెల 9 నుంచి 11 వరకు హైదరాబాద్ చందానగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో సిటీస్టైల్ జిమ్ క్రీడాకారులు మహంతి వెంకటకృష్ణాజీ, గాలి రామ్మోహన్‌రావులు బంగారు పతకాలు సాధించారు. సందర్భంగా జిమ్ కోచ్ రామిరెడ్డి మాట్లాడుతూ...జాతీయ స్థాయిలో రాణించేందుకు క్రీడాకారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో సంతోష్, రాజేష్, నవీన్, రాము, విజయ్, శంకర్, పవన్, అజయ్, వినయ్, ఉదయ్, కిరణ్, రాజా, నరేందర్‌రెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే నివాళి

దమ్మపేట: అనారోగ్యంతో మృతి చెందిన వృద్ధురాలి భౌతిక కాయానికి బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు పూలమాలతో నివాళులర్పించారు. మండలంలోని సుధాపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు కోటగిరి యుగంధర్ మాతృమూర్తి బాయమ్మ(75) దీర్ఘకాలిక అనారోగ్యం కారణంగా ఆదివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే తాటి సుధాపల్లి గ్రామంలో మృతురాలి భౌతిక కాయానికి పూలమాలతో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


ప్రారంభిస్తున్న చర్ల సీఐ రాజువర్మ

అన్నపురెడ్డిపల్లి: మండల పరిధిలోని ఎర్రగుంట గ్రామం బస్‌షెల్టర్‌లో తొలిఅడుగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చలివేంద్రం ప్రారంభించారు. చలివేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు వేముల రమణ ప్రారంభించి మాట్లాడారు. గ్రామంలో అనేక కార్యక్రమాలు చేస్తున్న తొలిఅడుగు ఫౌండేషన్ సభ్యులను అభినందించారు. కార్యక్రమంలో తొలిఅడుగు సభ్యులు రాము, సౌజన్య, స్వాతి, సుభాని, ఖాసీ తదితరులు పాల్గొన్నారు.

చర్ల: చర్ల చెందిన దనికొండ నర్సింహారావు–అనసూయమ్మల జ్ఞాపకార్థం వారి కుమారుడు ధనికొండ చిన్నారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం చర్లలో సీఐ రాజువర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వేసవిలో వివిధ పనుల కోసం మండల కేంద్రాలు, ప్రధాన గ్రామాలకు వచ్చేవారి కోసం చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.


పూర్తి చేయాలి

అశ్వారావుపేట(ములకలపల్లి): మండలకేంద్రంలో మొదలుపెట్టిన సెంట్రల్ లైటింగ్ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల చెన్నయ్య అన్నారు. పార్టీ మండల కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుతో కలిసి ఆదివారం ములకలపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రోడ్డు విస్తరణ పనులపేరిట ఇళ్లు, దుకాణాలు, హోటళ్ల వద్ద జేసీబీతో తవ్వి వదిలేశారని అన్నారు. ఆ తరువాత సుమారు ఇరవై రోజులుగా ఎటువంటి పనులు చేయడంలేదని అన్నారు. జేసీసీ చేసిన గోతులతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిపోయిన పనులను వెంటనే మొదలు పెట్టాలరని, వర్షాకాలంలోగా పనులన్నీ పూర్తి చేయాలని అన్నారు.

‘మూకమామిడి’కి మరమ్మతులేవి?

- పనిచేయని ఎడమకాలువ షట్టర్
- వృథాగా బయటకుపోతున్న నీరు
- ప్రశ్నార్థకంగా వానాకాలం సాగు


మూకమామిడి ప్రాజెక్ట్..


తూము షట్టర్ల గుండా బయటకు పోతున్న నీరు

ములకలపల్లి: మూకమామిడి ప్రాజెక్ట్ ఎడమ కాలువ తూము రిపేరు కావడంతో నీరంతా వృథాగా బయటికిపోతోంది. తూముకు అమర్చిన రెండు షట్టర్లు స్ట్రక్ కావడంతో, కాలువ గుండా నీళ్లు దిగువకు పోతున్నాయి. ఈ కాలువ పరిధిలో 2,260 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. ప్రాజెక్ట్‌లోని నీటి ప్రవాహం ఇలాగే సాగితే వర్షాలకు వచ్చిన నీరంతా వృథాగా బయటికి పోయే ప్రమాదముందని, వానాకాలం సాగు కష్టమేనని ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఇదీ ప్రాజెక్ట్ నేపథ్యం..

మధ్యతరహా నీటిపారుదల జలాశయం 1978లో నిర్మాణం ప్రారంభించగా, 1980లో రైతులకు అందుబాటులోకి వచ్చింది. సమీపంలోని సుమారు 10 గిరిజన గ్రామాలకు చెందిన రైతులకు చెంది. 3,326 ఎకరాల ఆయకట్టు భూమి ఉంది. కుడి, ఎడమ తూముల ద్వారా కాలువల గుండా నీరు పొలాలకు వెళుతుంది. మిషన్ కాకతీయ పథకంలో 9 కోట్ల వ్యయంతో ప్రాజెక్ట్ మరమ్మతులు చేశారు. రెండు తూములు తొలగించి నూతనంగా నిర్మించారు. కాలువలకు కాంక్రీట్ చేశారు. కట్ట మరమ్మతులు చేశారు. కాగా ఈ వర్షాకాలంలో ఎడమ తూము షట్టర్‌లో సమస్య ఏర్పడింది.

ఫలితంలేని తాత్కాలిక మరమ్మతులు

గత ఆగస్టు మాసంలో ఎడమ తూములోని రెండు షట్టర్లు అడుగుల లోతులో ఇరుక్కుపోయాయి. దీంతో షట్టర్ పైకి వచ్చే వీలులేకుండా పోయింది. ప్రాజెక్ట్ నీళ్లు బయటికి రాకపోవడంతో, ఇరిగేషన్ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ముంబై, వైజాగ్‌కు చెందిన నిపుణుల బృందంతో షట్టర్ పైకెత్తి, నీళ్లు బయటికి పారేలా చేశారు. ఐతే కొంతకాలానికి షట్టర్ మళ్లీ ఇరుక్కుపోయింది. దీంతో షట్టర్లు కిందకి దింపడం వీలుకావట్లేదు. ఈక్రమంలో ప్రాజెక్ట్‌లోని నీరు వృథాగా బయటికి పోతోంది. దీంతో ప్రస్తుతం నీటి నిల్వ గణనీయంగా పడిపోయింది. వర్షాకాలంలో నీరు వచ్చినా, షట్టర్ కిందకు దింపే అవకాశం లేకపోవడంతో, ఆ నీరంతా వృథాగా దిగువకు వెళుతుందనడంలో సందేహమేలేదు. త్వరితగతిన శాశ్వత మరమ్మతులు చేపట్టాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

త్వరితగతిన బాగు చేయాలి



కాలువ గుండా ప్రాజెక్ట్‌లోని నీళ్లన్నీ బయటికి పోతున్నాయి. వర్షాలకు నీళ్లు వచ్చినా, ఇలా దిగువకు నీళ్లపోతే ప్రాజెక్ట్ నిండదు. షట్టర్లు మరమ్మతులు చేయకపోతే, వ్యవసాయం చేయడం కష్టమే. రానున్న వర్షాకాలం సాగుకు ఇబ్బందులు ఎదురవుతాయి. త్వరిగతిన మరమ్మతులు చేపట్టాలి.

– కణితి వెంకటేష్, గుట్టగూడెం

మరమ్మతులు చేపడతాం..



మెకానికల్, సివిల్ అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పర్యటించి, తూములను పరిశీలించారు. షట్టర్ల మరమ్మతుల నిమిత్తం నివేదికలు రూపొందించి, నిధులు మంజూరీకి ఉన్నతాధికారులకు సమర్పించారు. నెలాఖరులోగా మరమ్మతులు మొదలుపెట్టి, సకాలంలో పనులన్నీ పూర్తి చేస్తాం.

– గపూర్‌పాషా, ఏఈ, ఇరిగేషన్‌శాఖ

మేనిఫెస్టో కాంగ్రెస్ చిత్తశుద్ధికి నిదర్శనం


సమావేశంలో మాట్లాడుతున్న పొదెం వీరయ్య

దుమ్ముగూడెం: కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం రాష్ట్రాలకు ప్రత్యేకంగా మ్యానిఫెస్టోను విడుదల చేయడం ప్రజలపై కాంగ్రెస్ పార్టీకి వున్న చిత్తశుద్ధికి నిదర్శనం అని డీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్య అన్నారు. ఆదివారం లక్ష్మీనగరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు వీరమాచనేని వినీల్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. తెలంగాణ ప్రకటించిన మ్యానిఫెస్టోలో ప్రజలకు పంచ వాగ్దానాలతో పాటుగా ఆంధ్రాలో కలిసిన ఐదు గ్రామ పంచాయతీలను తెలంగాణలో కలుపుతామనే ప్రత్యేక అంశాలుగా చేర్చామని అన్నారు. సోనియా గాంధీ, కాంగ్రెస్ పార్టీ మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తారని అన్నారు. భద్రాచలంలోని కరకట్ట పనులు, రెండో వంతెన నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తామని, త్వరలోనే వాటి నిర్మాణానికి సంబంధించి ప్రణాళికలు రూపొందుతున్నాయని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాం నాయక్‌కు ఓట్లు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు నల్లపు దుర్గాప్రసాద్, నాయకులు చింతిరాల రవికుమార్,రౌతు నరసింహారావు, శోభన్‌బాబు, శీరపు అప్పల రెడ్డి, నటరాజ స్వామి, పిలక వెంకటరమణ రెడ్డి కనుబుద్ది దేవా, మద్ది రామి రెడ్డి, వేమన రెడ్డి, పూజారి సూర్య చంద్రరావు, ప్రవీణ్,బత్తుల రమేష్, కూసిన రవి, గంగోలు మాజీ సర్పంచ్ మడకం చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని నారంవారిగూడెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని అచ్యుతాపురం ఫీడర్ మరమ్మతుల కారణంగా సోమవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు స్థానిక ట్రాన్స్‌కో ఏడీఈ బి.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని, విద్యుత్ వినియోగదారులంతా గమనించి సహకరించాలని ఆయన ఈ సందర్భంగా కోరారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

దమ్మపేట: అప్పారావు–దిలీప్ మెమోరియల్, అంకంపాలెం ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో అశ్వారావుపేట నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను మండలంలోని అంకంపాలెం గ్రామంలో మెమోరియల్ సభ్యులు, ప్రజా ప్రతినిధుల చేతులమీదుగా ప్రారంభించారు. ఆదివారం ప్రారంభించిన ఈ టోర్నమెంట్‌లో తొలి మ్యాచ్ నాగుపల్లి, మందలపల్లి టీంల మధ్య జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ సోయం ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యులు పైడి వెంకటేశ్వరరావు, మెమోరియల్ సభ్యులు సులేమాన్, మంగ, పవన్ నాయకులు పర్వతనేని ప్రసాద్, ముళ్లపూడి వెంటేశ్వరరావు, వాసం శ్రీను, బొల్లికొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు వారాలుగా అందని కూలి

అశ్వాపురం: మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు గత ఆరు వారాలుగా డబ్బులు చెల్లించడం లేదు. ఆరు వారాలుగా పని చేస్తున్నా డబ్బులు రావడం లేదని ఉపాధి హామీ సిబ్బంది, అధికారులను అడిగితే ఇదిగో అదిగో అంటున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాలు, గిరిజన గ్రామాలలో ప్రజలు ఉపాధి హామీ పనులపైనే ఆధారపడుతుంటారు. పనులు చేసినా నెలల తరబడి డబ్బులు రాక కూలీలు ఇబ్బంది పడుతున్నారు. ఉపాధి హామీ డబ్బులు వెంటనే చెల్లించాలని కూలీలు కోరుతున్నారు. పని ప్రాంతాల్లో టెంట్లు ఏర్పాటు చేయాలని మెడికట్ కిట్లు, మంచినీరు సౌకర్యం కల్పించాలని కూలీలు కోరుతున్నారు.

కాంగ్రెస్ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ

మణుగూరుటౌన్: ఏఐటీయూసీ మాజీ కార్మిక సంఘం నేత, మణుగూరు మండల కాంగ్రెస్ నాయకుడు నామా వెంకటేశ్వరరావు ఇటీవల ఖమ్మంలో ప్రమాదంలో తలకు గాయమై హైదరాబాద్‌లోని కొండాపూర్ బ్రోనోవాలీ చికిత్సలు పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఆదివారం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఈ సందర్భంగా కుటుంబసభ్యులు, వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు దొబ్బల వెంకటప్పయ్య, గాండ్ల సురేష్, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

చర్ల: మండల కేంద్రమైన చర్లతో పాటు మండలంలోని పలు గ్రామాలలో ఆదివారం పోలీసులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇక్కడ జరిగే వారపు సంతకు సరిహద్దు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్, దంతెవాడ, సుకుమా, జిల్లాల్లోని అటవీ ప్రాంత గ్రామాలకు చెందిన ఆదివాసీలు పెద్ద ఎత్తున తరలివస్తుండగా వారి మాటున మావోయిస్టులు, మిలిటెంట్లు, మిలీషియా సభ్యులు, కొరియర్లు రావచ్చునన్న అనుమానంతో పోలీసులు ఈ తనిఖీలను చేపట్టారు. సరిహద్దు చత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి చర్ల మండలానికి వచ్చే ప్రధాన రహదారులైన లెనిన్‌కాలనీ, ఉంజుపల్లి, పూసుగుప్ప, తాలిపేరు ప్రాజెక్టు, తిప్పాపురం, కలివేరు క్రాస్‌రోడ్, దానవాయిపేట, చింతగుప్ప తదితర ప్రాంతాలల్లోని రహదార్లలో మోహరించిన సీఆర్‌పీఎఫ్, స్పెషల్ పార్టీ, సివిల్‌పోలీసులు వచ్చి పోయే ఆదివాసీలను నిశితంగా తనిఖీ చేశారు. తనిఖీలలో భాగంగా అనుమానితులుగా భావిస్తూ పలువురు ఆదివాసీలను అదుపులోకి తీసుకోగా విచారించి నిర్ధారించుకున్న తరువాత వారిని విడిచిపెట్టారు. సీఐ ఏ రాజువర్మ నేతృత్వంలో ఎస్సైలు టీవీఆర్ సూరి, నర్సిరెడ్డి తనిఖీల్లో పాల్గొన్నారు.

పోడు పోరుకు సీపీఐ సిద్ధం

గుండాల: అనేక సంవత్సరాల నుంచి పోడు చేసుకుని సాగు చేసుకుంటున్న భూములను ఫారెస్టు అధికారులు కందకాల పేరుతో లాక్కుంటున్నారని, ఈ దౌర్జన్యం సరైంది కాదని వ్యవసాయ కార్మిక సంఘం బీకేఎమ్‌యూ జిల్లా అధ్యక్షుడు రేసు ఎల్లయ్య అన్నారు.

ఆదివారం ఆళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గత రెండు రోజులుగా వెంకటాపురం గ్రామంలో పోడు భూముల్లో కందకాలు తీస్తున్న క్రమంలో తాము అక్కడికి వెళ్లి అటవీశాఖ అధికారులను ప్రశ్నించామన్నారు. పోడు రైతులకు సీపీఐ అండగా ఉంటుందని, పోడు పోరుకు సీపీఐ సిద్ధమవుతుందని తెలిపారు. ఫారెస్ట్ అధికారులు అత్యుత్సాహంతో ప్లాంటేషన్ పేరుతో కందకాలు తీయడం సరైంది కాదన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


తరగతి గదిలో బల్లలపై కూర్చున్న పూర్వ విద్యార్థులు

మణుగూరుటౌన్: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని సింగరేణి పాఠశాలలో 1989–90లో చదువుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో కలుసుకున్నారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత తోటి స్నేహితులను కలుసుకోవడంతో వారి ఆనందానికి అవధులు లేవు. ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకుని యోగ క్షేమాలు అడిగి తెలుసుకుని కొందరు మరణించి రాకపోవడంతో విచారం వ్యక్తం చేస్తూ ఈ సందర్భంగా వివిధ దేశాలలో స్థిరపడి హాజరుకాలేని స్నేహితులకు జూమ్ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మనోగతం అనే కార్యక్రమం నిర్వహించి అప్పటి మధుర స్మృతులు నెమరువేసుకుంటూ పాఠశాల కలియదిరిగారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. పూర్వ విద్యార్థులు విజయ్ కుమార్, కృష్ణ, ఎస్.శ్రీను, అరవింద్, తారకుమారిలు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

సీఎంఓఏఐ నూతన కమిటీ సమావేశం


అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా జీఎం దుర్గం రామచందర్

మణుగూరుటౌన్: ఉత్పత్తి లక్ష్యాల సాధనకు సహకారం అందిస్తూనే అధికారుల సమస్యల పరిష్కారానికి దశలవారీ ఆందోళనకు సిద్ధమని కోల్‌మైన్స్ ఆఫీసర్స్ అసొసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) నూతన కమిటీ సమావేశంలో తీర్మానించారు. ఆదివారం మణుగూరులోని ఇల్లెందు క్లబ్‌లో అధికారుల సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి లక్ష్మీపతిగౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి అన్ని ఏరియాల సీఎంఓఏఐ నూతన కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి అతిథిగా హాజరైన మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ మాట్లాడుతూ.. అధికారుల సమస్యలు సముచిత బాటలో తీసుకెళ్తే తప్పక పరిష్కారం అవుతాయన్నారు. గతేడాది నిర్దేశించిన లక్ష్యాన్ని సాధించడం పట్ల అధికారులు హర్షం వ్యక్తం చేశారు. సీఎండీ బలరాంనాయక్, డైరెక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. ఇదే స్ఫూర్తితో 2024–25 లక్ష్య సాధనకు రక్షణతో కూడిన ఉత్పత్తికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం సింగరేణిలో అధికారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను సుదీర్ఘంగా చర్చించడంతో అధికారుల పదోన్నతుల భర్తీ చేసే విషయంలో జాప్యం, పే ఎనామలి, చిన్న సంఘటనలకు అధికారులకు చార్జిషీట్లు ఇస్తున్న అంశంతో పాటు అధికారుల మానసిక ఒత్తిళ్లు, పనిభారం, దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం విషయంలో తీసుకోవాల్సిన చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో సీఎంఓఏఐ ప్రధాన కార్యదర్శి పెద్ది నర్సింహులు, ఉపాధ్యక్షులు పానుగోటి శ్రీనివాస్, రాజీవ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ కిరణ్ రాజ్, సీహెచ్ రాజగోపాల్, కోశాధికారులు విజయగిరి నరేశ్, బి.రాజగోపాల్, ఏరియా అధ్యక్షుడు కోడి కృష్ణమూర్తి, ఎండి.మదార్ సాహెబ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

‘వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలి’

మణుగూరురూరల్: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీ సమావేశాలకు హాజరుకావడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తెల్లం వెంకట్రావు రాజీనామా చేసి పార్టీ మారాలన్నారు. ఎమ్మెల్యే వెంకట్రావుపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌కు ఫిర్యాదు చేయనున్నామన్నారు. స్పీకర్ చర్యలు తీసుకోకపోతే న్యాయపరంగా ముందుకు వెళతామన్నారు.

రేగా మాటలు హాస్యాస్పదం

అశ్వాపురం: భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరగానే అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య అన్నారు. అశ్వాపురంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆనాడు కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచి టీఆర్ఎస్ పార్టీలో చేరినప్పుడు మీకు ఏ పార్టీ అనర్హత వేటు వేసిందని రేగాను ప్రశ్నించారు. ఆనాడు మీరు చేసిన కర్మఫలం నేడు పినపాక ప్రజలు ఆ కర్మ ఫలితాన్ని మీకు రుచి చూపించారని అన్నారు. తుక్కుగూడ సభ విజయవంతం చేసిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతరకు ముస్తాబైన ఆలయం

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని పాత ఎల్ఐసీ ఆఫీస్ రోడ్‌లోని 154 ఏళ్లుగా పూజలందుకుంటున్న శ్రీశివ ముత్యాలమ్మ ఆలయం జాతరకు ముస్తాబైంది. ఈ పురాతన ఆలయంలో అమ్మవారి జాతరను ప్రతి ఏటా ఉగాది రోజున ఆలయ కమిటీ వారు అంగరంగ వైభంగా నిర్వహిస్తారు. ఆలయానికి రంగులు వేసి విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. జాతర సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఊరేగింపు కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహిస్తారు. స్థానికులతో చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తుల అధిక సంఖ్యలో హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకుంటారు. ఇందు కోసం ఆలయ కమిటీ వారు ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆయల కమిటీ అధ్యక్షుడు హరిశ్చంద్ర నాయక్ తెలిపారు. జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రహదారిపై పడిన వృక్షం


జాతీయ రహదారిపై అడ్డంగా పడిన భారీ వృక్షం

అశ్వారావుపేటరూరల్: ఎండిన ఓ భారీ వృక్షం ఆదివారం తెల్లవారుజాము సమయంలో జాతీయ రహదారిపై అడ్డంగా పడింది. దాంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అశ్వారావుపేటలోని ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న వృక్షం ఎండిపోవడంతో ఒక్కసారిగా విరిగి నేలమట్టమైంది. జాతీయ రహదారిపై అడ్డంగా పడిపోవడంతో సత్తుపల్లి వైపు నుంచి వచ్చే వాహనాలు, అశ్వారావుపేట వైపు వెళ్లే వాహనాలు దాదాపు రెండు గంటల పాటు నిలిచిపోయాయి.

భారీ వృక్షం కావడంతో దానిని తొలగించడం సాధ్యం కాకపోవడంతో ఈ సమాచారాన్ని అందుకున్న స్థానిక పోలీసులు జేసీబీ సాయంతో తొలగించారు. అనంతరం వాహనాల రాకపోకలను పునఃరుద్ధరించారు.

రంజాన్ తోఫా పంపిణీ


కరకగూడెం: ముస్లింలకు రంజాన్ తోఫాలు అందజేస్తున్న సోందుపాషా


బూర్గంపాడు: సారపాకలో జమైతే ఇస్లామిక్ హింద్ ప్రతినిధుల ఆధ్వర్యంలో..

బూర్గంపాడు: జమాతే ఇస్లామిక్ హింద్ ఆధ్వర్యంలో సారపాకలోని సాజిదా మజీద్‌లో ఆదివారం పేద ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. సంపాదించిన దానిలో పేదవారికి సాయం చేయాలన్న అల్లాహ్ మార్గంలో ఈ రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జమాతే ఇస్లామిక్ హింద్ సారపాక పట్టణ కమిటీ అధ్యక్షుడు ఇషాక్, జహీర్ పాషా, షేక్ అబ్దుల్ సలీమ్, బషారత్, నాగూర్‌వలి, సైదుద్దీన్, సిలార్, పాషా తదితరులు పాల్గొన్నారు.

కరకగూడెం: ‘ప్రాణిక్ హీలింగ్ ఫౌండేషన్ ఆఫ్ సికింద్రాబాద్’ సభ్యుడు, కరకగూడెం గ్రామీణ వైద్యులు షేక్ సోందుపాషా ఆదివారం మండల కేంద్రంలోని తన నివాసంలో మండలంలోని పలు గ్రామాలకు చెందిన సుమారు 50 పేద కుటుంబాలకు రంజాన్ పండుగను పురస్కరించుకుని సేమియాలు, పాలు ఇతరత్రా పదార్థాలతో కూడిన తోఫాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పండుగను ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ తోపాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, పలు గ్రామాల ముస్లింలు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: సింగరేణి కార్మిక నాయకులు, ఓసీ–2 ఉద్యోగి షేక్ అబ్దుల్ రవూఫ్ ఏరియా సేవా కార్యదర్శి షాకిరా దంపతుల ఆధ్వర్యంలో ఆదివారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. పీవీకాలనీలోని వారి నివాసంలో రంజాన్ పండుగ ముందస్తు వేడుకల సందర్భంగా ఏరియాలోకి నిరుపేద ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫా, మహిళలకు చీరలు అందజేసి ఔదార్యాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో ఆరిఫ్, ఆసిఫ్, అఫ్రిన్, గౌసియా, సామాజిక కార్యకర్త నాజర్‌పాష, హబీబ్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం(భద్రాచలంటౌన్): భద్రాచలం పట్టణంలోని అర్హులైన ముస్లిం మహిళలకు ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ఆదివారం చీరలు పంపిణీ చేశారు. స్థానిక ఎంపీ కాలనీలోని బిలాల్ మజీద్ వద్ద ఆర్థిక సహాయంతో పాటు చీరల పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముస్లీం వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్గనైజర్ ఎస్‌కె.ఉస్మాన్, ఉస్మాన్, మొహమ్మద్ బాబాజీ, పాషా, వలీవుల్లా, షేక్ గాలిబ్ పాల్గొన్నారు.